సాక్షి జనగామ

శుక్రవారం । 31 । మే । 2024



హాజరుపై నజర్

టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఉద్యోగ సంఘాల నాయకుల హాజరుపై యాజమాన్యం దృష్టి సారించింది. టీజీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, టీజీ ఎన్పీడీసీఎల్‌కు ఫిర్యాదులు అందాయి.

- 8లో▶



కుళ్లిన మాంసం ముద్దలు..

హనుమకొండలోని మూడు పేరుగాంచిన హోటళ్లల్లో గురువారం అధికారులు తనిఖీలు చేపట్టగా కళ్లు బైర్లు కమ్మే నిజాలు వెలుగుచూశాయి.

- 8లో▶

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $43^0/32^0$

ఉదయం నుంచి ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి పూట ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

- డీఎల్‌పీఓ పార్థసారథి



బచ్చన్నపేట : పంచాయతీ కార్యదర్శులు జీపీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీఎల్‌పీఓ పార్థసారథి అన్నారు. గురువారం మండలంలోని కొడవటూర్, బండనాగారం గ్రామాల్లో పర్యటించిన ఆయన పల్లె ప్రకృతి వనాలు, వన నర్సరీలు, డంపింగ్ యార్డులను పరిశీలించి జీపీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, ప్రజలకు నిత్యం నీరు అందిస్తూ పైపుల లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఇళ్లలోని చెత్తను ఆరుబయట వేయకుండా జీపీ ట్రాక్టర్లలో వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలి వేంద్రాల్లో నిత్యం తాగు నీరు ఉండేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బ్యంగి రూపా చైతన్య, భరత్ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ ఈసెట్‌లో అఖిలకు 38వ ర్యాంక్



స్టేషన్‌ఘన్‌పూర్: ఏపీ ఈసెట్ ఫలితాల్లో శివుని పల్లికి చెందిన రావుల అఖిల ఇంటిగ్రేటెడ్‌లో 38వ, ఈఈఈ బ్రాంచ్‌లో 3వ ర్యాంకు సాధించింది. రావుల కవిత, నాగన్న దంపతుల కుమార్తె అఖిల స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈ విభాగంలో డిప్లామా పూర్తి చేసింది. బీటెక్‌లో ప్రవేశానికి నిర్వహించిన ఈసెట్ పరీక్ష రాయగా గురువారం విడుదలైన ఫలితాల్లో అఖిల 200 మార్కులకు 146 మార్కులు సాధించింది. అలాగే ఇటీవల వచ్చిన తెలంగాణ ఈసెట్ ఫలితాల్లోనూ ఈఈఈ విభాగంలో 27వ ర్యాంకు సాధించి అందరి మన్ననలు పొందింది. అఖిలను పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య, ఈఈఈ హెచ్ఓడీ బీవీవీఎస్ రామకృష్ణ, జనరల్ హెడ్ రాజ్‌కుమార్, సివిల్ హెడ్ నవీన్ కుమార్, సీనియర్ అధ్యాపకులు మధుసూదన్ రావు, అనిల్‌కుమార్ అభినందించారు.

'అంకాల'కు ప్రశంసలు



దేవరుప్పుల : సాహితీవేత్త సురవరం ప్రతాప్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో మండల కేంద్రానికి చెందిన సామాజిక కవి అంకాల సోమయ్య తన కవితా గానంతో ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సురవరం ప్రతాపరెడ్డి కుమారుడు విశ్వవర్ధన్ పర్యవేక్షణలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి శ్రీ బాలాచారి, ప్రముఖ కవి, సాహితీ వేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి జ్ఞాపికను అందజేసి సన్మానించారు.

డిజీ ట్రాక్ యంత్రం అపహరించిన వ్యక్తి అరెస్ట్



జనగామ: బీఎస్ఎన్ఎల్‌కు చెందిన డిజీ ట్రాక్ యంత్రాన్ని అపహరించిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఏసీపీ అంకిత్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం అంబేడ్కర్‌నగర్ జిల్లా ధన్‌సుర్‌పూర్ జహంగీర్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన సోనూ యాదవ్ కొంత కాలం క్రితం జనగామ మండలం యశ్వంతాపూర్ భగవతి కన్‌స్ట్రక్షన్ అండ్ సప్లయ్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. మద్యానికి బానిసైన సోనూ జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో తన ఆధీనంలో ఉన్న డిజీ యంత్రాన్ని అమ్మివేయడానికి సహచరుడికి ఇచ్చి సొంత రాష్ట్రం పపించాడు. పక్కా సమాచారం మేరకు ఎస్సై భరత్ ఆధ్వర్యంలో పి.శ్రీనివాసరాజు, ఎ.విశేశ్వర్, ఓ.వంశీ, కరుణాకర్, టి.రామన్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చేరుకుని డిజీ ట్రాకర్ యంత్రాన్ని స్వాధీనం చేసుకుని, సోనూయాదవ్‌ను రిమాండ్‌కు పంపించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితున్ని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఏసీపీ అభినందించినారు. ఆయన వెంట సీఐ రఘుపతిరెడ్డి ఉన్నారు.

'బడిబాట'కు వేళాయె..

- జూన్ 3 నుంచి 19 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం
- విద్యార్థుల సంఖ్య పెంపుపై దృష్టి సారించిన విద్యాశాఖ
- స్కూళ్లలో కొనసాగుతున్న వసతుల కల్పన పనులు



బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు(ఫైల్)

జనగామ రూరల్: వేసవి సెలవుల అనంతరం బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం 'బడిబాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సర్కారు స్కూళ్లలో కల్పిస్తున్న వసతులు, ఇంగ్లిష్ మీడియంలో బోధనపై ప్రజల్లో అవగాహన కల్పించి విద్యార్థులు పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టింది. జూన్ 3 నుంచి 19వ తేదీ వరకు 'బడిబాట' కింద పలు కార్యక్రమాలు నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేశామని జిల్లా విద్యాధికారి కె.రాము తెలిపారు. పాఠశాలల్లో అవసరమైన అన్ని రకాల వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మౌలిక వసతుల కల్పన

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. జిల్లాలోని 291 పాఠశాలల్లో ఇప్పటికే 93 స్కూళ్లలో మౌలిక వసతులు, సుందరీకరణ పనులు పూర్తయ్యాయి. మిగతా వాటిలో పాఠశాలల పునః ప్రారంభం నాటికి పూర్తి చేయనున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా 'బడిబాట' కార్యక్రమం ఉదయం 7 నుంచి 11 వరకు నిర్వహించనున్నారు.

కార్యక్రమాలు ఇలా..

3న : అన్ని గ్రామాల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, వీఓలతో సమావేశం ఏర్పాటు చేసి బడిబాట గురించి చర్చించి ప్రతిజ్ఞ చేయించాలి. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులను బాగస్వాములుగా చేయాలి.

4న : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల చొరవతో ఇంటింటి ప్రచారం, ర్యాలీలు, బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాల పంపిణీతో పాటు బడీడు, ప్రత్యేక అవరాలు కలిగిన పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించాలి.

5–10 వరకు : అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బడీడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలపై ప్రచారం చేయాలి. దివ్యాంగులను భవిత పాఠశాలల్లో చెర్పించాలి.

11న: గ్రామ సభ నిర్వహించి 3 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన కార్యక్రమాలపై చర్చించాలి. గుర్తించిన పిల్లలు 12వ తేదీన పాఠశాలకు వచ్చేలా చూడాలి.

12–19 వరకు : పాఠశాలల్లో స్వాగత దినోత్సవం నిర్వహించి రెడీనెస్ ప్రోగ్రాం చేపట్టాలి. బడిలో పండుగ వాతావరణం కల్పించి విద్యార్థులకు స్వాగతం పలకాలి

13న : ఎఫ్ఎల్ఎన్ డే నిర్వహణ

14న : సాహూహిక అక్షరాభ్యాసం, ఉన్నత పాఠశాలలో బాల సభ నిర్వహించాలి

15న : బాలికా దినోత్సవం నిర్వహించాలి

18న : డిజిటల్ తరగతులపై అవగాహన, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలి

19న : క్రీడా దినోత్సవం నిర్వహించాలి

ఇవీ లక్ష్యాలు

- బడీడు పిల్లలను గుర్తించి సమీప పాఠశాలలో చేర్పించాలి.
- అంగన్‌వాడాల్లోని ఐదేళ్ల పిల్లలను దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి.
- 5 నుంచి 7వ తరగతి పూర్తి చేసి.. స్కూల్‌కు వెళ్లడం మానేసే దశలో ఉన్న పిల్లలకు పై తరగతిలో ప్రవేశం కల్పించాలి.
- తక్కువ విద్యార్థుల నమోదు ఉన్న పాఠశాలలపై దృష్టి పెట్టి తల్లితండ్రులను చైతన్యం చేసి పిల్లలను చేర్పించాలి.
- పిల్లల వయస్సుకు తగిన తరగతిలో ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- బాలికా విద్య ప్రాముఖ్యతపై గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలి

ఏర్పాట్లు పూర్తయ్యాయి..



'బడిబాట' కింద చేపట్టే కార్యాక్రమాలపై ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉపాధ్యాయులకు ఆదేశాలు ఇచ్చి ప్రత్యేక చర్యలు చేపట్టాం. బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తాం. - కె.రాము, జిల్లా విద్యాధికారి

సూర్య @ 44.5

- ఉగ్రరూపం దాల్చిన ఎండలు
- ఉక్కపోతతో జనం విలవిల
- నిప్పుల కొలిమిని తలపిస్తున్న రహదారులు

జనగామ: అకాల వర్షాలతో తగ్గుముఖం పట్టిన ఉష్ణోగ్రతలు.. మళ్లీ ఉగ్రరూపం దాల్చాయి. గత పది రోజులుగా 37 నుంచి 44.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదుకాగా.. ప్రజలు ఎండ వేడిమి, ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరై పోతున్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చి.. తిరిగి వెళ్లే లోపే చెమటలతో స్నానం చేస్తున్నారు. ఏసీలు మినహా.. ఫ్యాన్లు, కూలర్లు సైతం పని చేయడంలేదు. రహదారులు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చే ప్రజలు.. వడదెబ్బ తగలకుండా ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా నీరసించి పోతున్నారు. జిల్లాలో గురువారం అత్యధికంగా బచ్చన్నపేట, జఫర్‌గఢ్‌లో 44.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, స్టేషన్‌ఘన్‌పూర్ పరిధి తాటికొండలో అత్యల్పంగా 40.8 డిగ్రీలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. జిల్లాలోని అన్ని మండలాలకు ఆరెంజ్ అలర్టు జారీ చేయగా, మరో రెండు రోజుల్లో చిన్నపాటి వర్షాలతో వాతావరణం కొంతమేర చల్లబడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ రిపోర్టులో పేర్కొంది.



గురువారం మధ్యాహ్నం 2.20 గంటలకు జనగామ ఆర్టీసీ చౌరస్తాలో..





ఎర్రని ఎండలో ప్రయాణం..

గడిచిన 10 రోజులుగా జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు (సెల్సియస్ డిగ్రీల్లో)

తేదీ	ఉష్ణోగ్రతలు	తేదీ	ఉష్ణోగ్రతలు
19	37.0	26	43.1
20	39.8	27	41.5
21	40.3	28	42.2
24	42.8	29	43.4
25	40.0	30	44.5

పీజీ కోర్సుల సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పీజీ కోర్సుల (నాన్ ప్రొఫెషనల్స్) కోర్సుల సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు జూన్ 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యజి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సులతోపాటు కంప్యూటర్ సైన్స్, ఎంటీఏ, ఎంఎస్‌డబ్ల్యూ, అండ్ ఎంహెచ్ఆర్ఎం, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ తదితర కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల చేశారు. జూన్ 11, 13, 15, 18, 20, 22 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని వారు తెలిపారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- సమీక్షలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్, డీసీపీ సీతారాంతో కలిసి పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు పోలీస్ పరేడ్‌తో పాటు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జూన్ 2వ తేదీన కలెక్టరేట్‌తో పాటు మండలాలు, గ్రామాలు, మున్సిపల్ ఇతర కార్యాలయాల్లో ఉదయం 9 గంటలలోపు జెండా ఆవిష్కరించాలని చెప్పారు. ప్లాస్టిక్ జెండాలను ఎగుర వేయవద్దని, విద్యుత్, ఫైర్, తదితర శాఖల అధికారులు అవతరణ వేడుకల సమయంలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

రేపటి నుంచి గ్రూప్–1 ప్రిలిమ్స్ హాల్ టికెట్లు

జూన్ 1వ తేదీ నుంచి గ్రూప్–1 ప్రిలిమ్స్ హాల్ టికెట్లు జారీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎంట్రెన్స్ పరీక్ష ఉంటుందని, జిల్లాలో 3,697 మంది అభ్యర్థులకు 14 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, అబ్జర్వర్లు 14 మంది చొప్పున, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఐదుగురు రూట్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. పోలీసులు, ఆర్టీసీ, రెవెన్యూ తదితర శాఖలతో మాట్లాడి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చూడాలని చెప్పారు. ఒకటో తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని ఏ4 సైజ్‌లో కలర్ ప్రింట్ తీసుకుని తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో మాత్రమే అతికించాలన్నారు. డౌన్‌లోడ్ చేసిన హాల్ టికెట్‌పై ఫొటో సరిగా ముద్రించి లేకుంటే అభ్యర్థి గెజిటెడ్ అధికారి లేదా చివరగా చదువుకున్న విద్యా సంస్థ ప్రిన్సిపాల్ అటెస్ట్‌తో మూడు పాస్‌పోర్టు ఫొటోలతో పాటు వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ధ్రువీకరణ పత్రాన్ని పూర్తిచేసి ఇన్విజిలేటర్‌కు అందించాలని చెప్పారు. ఏమైనా సందేహాలు ఉంటే సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్–9866011608 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఇదిలా ఉండగా.. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో 3 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేయాలన్నారు. జూన్ 10వ తేదీ లోపు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న, జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులు నిలిపివేయాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు పనునూరి సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామీణ ప్రాంత ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై తెలంగాణ వైద్య మండలి ఆధ్వర్యంలో చేపడుతున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పసునూరి సత్యనారాయణ కోరారు. సంఘం ఘన్‌పూర్ మండల అధ్యక్షుడు డాక్టర్ బుయ్య గట్టయ్య అధ్యక్షతన ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో ఆర్ఎంపీ, పీఎంపీలకు గుర్తింపు కార్డులు ఇచ్చారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రుల్లో క్వాలిఫైడ్ డాక్టర్లచే శిక్షణ ఇప్పించినట్లు గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం దాడులు చేయడం సమంజసం కాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని, మొత్తం ఆర్ఎంపీ వ్యవస్థనే నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం సరికాదన్నారు. దాడులు ఆపకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మంతెన రమేష్, చిల్పూరు, జఫర్‌గఢ్, రఘునాథపల్లి మండలాల అధ్యక్షుడు పేరాల చంద్రమౌళి, ఎం.నర్సయ్య, ఎం.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కమ్యూనిస్టులే దేశానికి ప్రత్యామ్నాయం



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

జఫర్‌గఢ్: కమ్యూనిస్టులే దేశానికి సరైన ప్రత్యామ్నాయం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం పార్టీ జిల్లా స్థాయి శిక్షణ తరగతుల ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామపక్షాలు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేకూర్చేందుకే పని చేసిందని, పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి సాయన్న, కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి, డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, పాతూరి సుగుణమ్మ, ఎ.శ్రీనివాస్, మంగళంపల్లి జనార్దన్, జువారి రమేష్ పాల్గొన్నారు.

నకిలీలపై నజర్

- విత్తన కొరత లేకుండా చర్యలు
- ఆథరైజ్డ్ డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి
- పంటల సాగు, విత్తన ఎంపికపై రైతులకు అవగాహన కల్పించాలి
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- సమస్యలుంటే 93986 16041 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి
- సమీక్షలో కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: వానాకాలం పంటల సాగుకు సంబంధించి జిల్లాలో విత్తనాల కృత్రిమ కొరత, లూజ్ సేల్, పల్లెల్లో ప్రైవేట్ వ్యక్తుల అమ్మకాలపై నిఘా పెంచాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. ఈ మేరకు డీసీపీ పి.సీతారాం, అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, పింకేష్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్‌తో కలిసి గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో రోజువారీ అమ్మకాల నివేదిక సమర్పించడంతోపాటు రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండేలా నిత్యం పర్యవేక్షించాలని కోరారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఏఓ, ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. జిల్లాలో పూర్తి స్థాయి టాస్క్‌ఫోర్స్ టీం ఏర్పాటు చేయకున్నా తాత్కాలికంగా తనిఖీలు చేపడుతున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఫర్టిలైజర్ దుకాణాలను నిరంతరం తనిఖీ చేస్తూ రికార్డుల నిర్వహణపై పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నకిలీ, లూజు విత్తనాల అమ్మకాలు, డీలర్ల మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.



జేకేఎస్ అగ్రిమాల్‌లో కలెక్టర్ తనిఖీలు

ముందస్తు ప్రణాళిక సిద్ధం

జిల్లాలో వానాకాలం సీజన్‌లో విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశారు. వరి, పత్తి, రెడ్‌గ్రామ్ తదితర పంటలు కలిపి 3.70లక్షల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. మొత్తం 5 వేల విత్తన ప్యాకెట్లు (క్వింటాళ్లు) అవసరం కాగా.. ప్రస్తుతం 1.91లక్షల (అన్ని రకాలు కలుపుకుని) ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయి. మిగతావి వారం రోజుల్లో తీసుకువచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. పత్తి విత్తన ప్యాకెట్లు 3,65,000 అవసరం ఉండగా 1,79,395 ప్యాకెట్లు, వరి 63,000 క్వింటాళ్ల విత్తనాలకు 34వేల క్వింటాళ్లు, కంది 400 క్వింటాళ్లకు 250 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్లు సమీక్షలో కలెక్టర్ వెల్లడించారు. కాగా 29,436 మెట్రిక్ టన్నుల ఎరువులు ఫర్టిలైజర్ షాపుల్లో అమ్మకానికి సిద్ధంగా ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

నకిలీ విత్తన అమ్మకాలు, ఫిర్యాదులు, సాగుపై సలహాలు, సూచనలకు సంబంధించి రైతులకు అధికారులను మరింత చేరువ చేసేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించి 9398616041 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఆథరైజ్డ్ ఫర్టిలైజర్ డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, రశీదుపై డీలర్ సంతకం ఉండేలా చూసుకుని, విత్తన రకం, లాట్ నంబర్ వివరాలతో కూడిన ఖాళీ కవర్ పంట కోతలు పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచాలన్నారు. దిగుబడి తగ్గిన సమయంలో విత్తనాలు అసలివా.. కల్తీవా అని తెలుసుకోవడానికి రశీదు తప్పనిసరి అని పేర్కొన్నారు.

దిగుబడి ఇచ్చే విత్తనాలపై దృష్టి పెట్టాలి

రైతులు ఒకే రకమైన విత్తనాలు కాకుండా దిగుబడి ఇచ్చే పలు రకాల విత్తనాలపై దృష్టి సారించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. వానాకాలం సీజన్ పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, డీసీపీ సీతారాం గురువారం వేర్వేరుగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. జేకేఎస్ అగ్రిమాల్‌లో స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి విత్తన నిల్వలకు సంబంధించి ఆరా తీశారు. విత్తనాలు, ఎరువులు, పరుగు మందులకు సంబంధించి కంపెనీ పేరు, చిరునామా పూర్తి వివరాలు రైతులకు ఇచ్చే రశీదులో ఉండాలని ఆదేశించారు. అనంతరం పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులతో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి ఏ ధరకు కొనుగోలు చేశారని వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డీఏఓ వినోద్‌కుమార్, స్థానిక ఏఓ కర్ణాకర్ ఉన్నారు. అంతకు ముందు డీసీపీ సీతారాం జేకేఎస్ అగ్రిమాల్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విత్తన ప్యాకెట్లు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సప్లిమెంటరీ పరీక్షలకు 85 మంది గైర్హాజరు

జనగామ రూరల్: జిల్లాలో గురువారం నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 85 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారని ఇంటర్ విద్యాధికారి ఆంజనేయరాజు తెలిపారు. ఉదయం పరీక్షలో జనరల్ విద్యార్థులు 731 మందికి 690, ఒకేషనల్‌లో 339 మందికి 315, మధ్యాహ్నం పరీక్షకు జనరల్ 366 మందికి 352, ఒకేషనల్ 137 మందికి 131 పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు.

జూన్‌లో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహిస్తాం..

బచ్చన్నపేట : పద్మశాలి సంఘం నూతన కమిటీని ఎన్నుకోవడానికి జూన్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల బాల్‌రాజు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల వరకు పద్మశాలీల కుల సభ్యత్వం నమోదు చేశామన్నారు. గత ఏడాది పద్మశాలి నాయకుడు రామ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థాపించిన తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం గొప్ప ఆలోచనతో ముందుకు సాగుతున్నదని చెప్పారు. శ్రీనివాస్ అకాల మరణం చెందినందున ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.



తుమ్మ బాలకు నివాళి

హైదరాబాద్ విశ్రాంత అగ్ర పీఠాధిపతి తుమ్మ బాల గురువారం కన్నుమూశారు. ఆయన పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఫాతిమా కేథడ్రల్ చర్చిలో ఉంచారు. ఓరుగల్లు మేత్రాసనం పీఠాధిపతి రెవరెండ్ డాక్టర్ ఉడుముల బాలతోపాటు పలువురు నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరి బసిలికాలో భూస్థాపిత పూజ చేయనున్నట్లు పాతిమా కేథడ్రల్ చర్చి కమిటీ సభ్యులు తెలిపారు. - కాజీపేట రూరల్

క్లుప్తంగా

దుస్తులు ఆరేస్తూ మృత్యుఒడికి..

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి
- తొర్రూరులో ఘటన


వినీత్‌కుమార్ మృతదేహం

తొర్రూరు: దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన డివిజన్ కేంద్రం తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన వినీత్ కుమార్(36) కొంత కాలంగా తొర్రూరు కేంద్రంగా ఐస్ క్రీమ్ తయారీ, చెరుకు రసం వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అద్దెకుంటున్న ఇంటి ఎదుట దుస్తులు ఆరేసేందుకు తీగలు ఏర్పాటు చేసుకున్నాడు. గురువారం రాత్రి స్నానం చేసి దుస్తులు ఆరేస్తున్న క్రమంలో తీగకు విద్యుత్ ప్రసరించింది. దీంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రిషిత, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు.

ఇస్తారి పరిశోధనకు పేటెంట్

- అభినందించిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి


ఇస్తారిని అభినందిస్తున్న కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పక్కన కోలశంకర్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మామిడాల ఇస్తారి, రీసెర్చ్ స్కాలర్ రాకేశ్ కలిసి చేసిన పరిశోధనకు పేటెంట్ లభించింది. 'అంత్రాక్వినోస్ ఆఫ్ రుమెక్స్ వేసి కారియాస్ యూజ్ ఏడై పెప్టిడైల్ పెప్టీడేజ్ ఇన్హిబిటార్' అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను భారత ప్రభుత్వం పేటెంట్ కార్యాలయం డాక్టర్ ఇస్తారికి పేటెంట్ సర్టిఫికెట్ జారీచేసింది. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ పి మల్లారెడ్డి గురువారం యూనివర్సిటీలో ఇస్తారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ కోల శంకర్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా మామిడాల ఇస్తారి తన పరిశోధన అంశం గురించి వివరించారు. డీసీపీ -4 అనే ఎంజైమ్ ఇన్సులిన్ విడుదలకు తోడ్పడే జీఎల్‌పీ -1 హార్మోన్‌ను నిరోధిస్తుందన్నారు. ఈ డీసీపీ -4 ఎంజైమ్ క్రియాశీలతను తగ్గిస్తే ఇన్సులిన్ విడుదలకు ఎలాంటి ఆటంకం లేకుండా జరుగుతుందని తెలిపారు. అందుకే రుమేక్స్ వేసికేరియస్ అనే మొక్క నుంచి అంత్రాక్వినోస్ రకానికి చెందిన రసాయనిక మూలకం ద్వారా ఈడీసీపీ -4 క్రియాశీలతను తగ్గించేందుకుగాను అనువైన పద్ధతిని ప్రవేశపెట్టినందునకుగాను భారత ప్రభుత్వం తమ పరిశోధనకుగాను పేటెంట్ జారీ చేసిందని తెలిపారు.

హాజరుపై నజర్

ఉద్యోగ సంఘాల నేతలు విధులకు డుమ్మా కొడుతున్నారని ఫిర్యాదులు

- గతంలో ఫుల్‌టైమ్ అనుమతిచ్చిన యాజమాన్యం
- 2023 జనవరి నుంచి ఎత్తివేత
- రాష్ట్ర నాయకులకు సంకట స్థితి
- నేతల హాజరు వివరాలు కోరిన విజిలెన్స్

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఉద్యోగ సంఘాల నాయకుల హాజరుపై యాజమాన్యం దృష్టి సారించింది. ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగుల సంక్షేమ అసోసియేషన్ల నాయకులు విధులకు డుమ్మా కొడుతున్నారని టీజీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, టీజీ ఎన్పీడీసీఎల్‌కు ఫిర్యాదులందాయి. దీంతో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఈమేరకు ఉద్యోగ సంఘాల నాయకులు పని చేస్తున్న కార్యాలయాల ఉన్నతాధికారులకు వివరాలు పంపాల్సిందిగా లేఖలు రాశారు.

గతేడాది నుంచి ఒకరికే!

రాష్ట్రంలో టీజీ జెన్‌కో, టీజీ ట్రాన్స్‌కో, టీజీ దక్షిణ విద్యుత్ పంపిణీ మండలి, టీజీ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలి ఉన్నాయి. గతంలో ఈ నాలుగు విద్యుత్ సంస్థల నుంచి యూనియన్‌కు ఒకరు చొప్పున నలుగురు ఉద్యోగ సంఘాల నాయకులు ఫుల్ టైమ్ అనుమతి తీసుకునేవారు. 2023 క్యాలెండర్ ఇయర్‌లో ఒక యూనియన్ నుంచి నలుగురికి అవకాశం కల్పించకుండా, ఒకే ఒక్క యూనియన్ నుంచి రాష్ట్రంలో ఒక్కరికి మాత్రమే ఫుల్‌టైమ్ ఇవ్వాలని 2022 డిసెంబర్16న జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ కంపెనీస్ కో ఆర్డినేషన్ మీటింగ్‌లో నాలుగు విద్యుత్ యాజమాన్య సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. అనంతరం 2023 క్యాలెండర్ సంవత్సరంలో కేవలం ఒక్క యూనియన్‌లో ఒక్కరికి మాత్రమే ఫుల్‌టైం అనుమతికి అవకాశమిచ్చింది. ఇది యూనియన్లు, వెల్ఫేర్ అసోషియేషన్‌లో అప్పట్లో పెద్ద దుమారం లేపింది. ఫుల్‌టైమ్ అంటే యూనియన్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న వ్యక్తి ఆ యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం, సమావేశాలకు హాజరవడం, ఇతరత్రా యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు విధులకు హాజరు కాకుండా పూర్తి స్థాయిలో మినహాయింపు ఇస్తారు. ఇటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ.. యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు వీలు కాదని భావించి సంస్థ ఫుల్‌టైమ్ అనుమతిస్తుంది.

వర్క్‌మెన్ కేడర్‌కు ఇవ్వాలని..

వర్క్‌మెన్ కేడర్‌కే ఫుల్ టైమ్ ఇవ్వాలని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు నిర్ణయించాయి. వర్క్‌మెన్ కేడర్ అంటే.. అధికారుల కంటే కింది స్థాయి ఉద్యోగులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో జేఎల్‌ఎం నుంచి ఫోర్‌మెన్ వరకు, ప్రొవెన్షియల్ (మినిస్టీరియల్) స్టాఫ్‌లో అటెండర్ స్థాయి నుంచి సీనియర్ అసిస్టెంట్ స్థాయి వరకు వస్తారు. ఆతర్వాత స్థాయి వారు వర్క్‌మెన్ కేడర్ పరిధిలోకి రారు. అయితే పలు యూనియన్లకు వర్క్‌మెన్ కేడర్ పై స్థాయి ఉద్యోగంలో కొనసాగుతున్న జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌లు రాష్ట్ర స్థాయి కీలక పదవుల్లో కొనసాగుతున్నారు. 2023 నుంచి వీరికి ఫుల్‌టైం అనుమతి నిలిచిపోయింది. దీంతో రాష్ట్ర స్థాయి పదవుల్లో ఉన్న యూనియన్, అసోషియేషన్ల నాయకులు యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి రావడం, ఉద్యోగుల సమస్యలు యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లే క్రమంలో విధులకు హాజరు కాలేకపోతున్నారు. దీన్ని అదనుగా తీసుకున్న కొందరు యూనియన్ నాయకులు విధులకు హాజరు కావడంలేదని పేర్లతో సహా టీజీ ట్రాన్స్‌కో, టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యాలకు ఫిర్యాదు చేశారు. నిజామాబాద్‌కు చెందిన బీఎంఎస్ నాయకుడు రాజేశ్వర్ రెడ్డి, విద్యుత్ సంస్థల సంక్షేమ సంఘం పేరుతో ఫిర్యాదులు యాజమాన్యాలకు అందాయి. దీంతో విద్యుత్ సంస్థల యాజమాన్యాలు యూనియన్ నాయకులు విధులకు హాజరు అవుతున్నారా? లేదా తెలుసుకునే పనిలో పడింది. సంబంధిత యూనియన్ నాయకుల హాజరు వివరాలు పంపాలని వారు పని చేస్తున్న కార్యాలయాల ప్రధాన అధికారికి విజిలెన్స్ విభాగం లేఖలు రాసింది. దీంతో ఫుల్‌టైం అనుమతి మరోసారి చర్చకు దారితీసింది. హాజరు వివరాలు సేకరించిన అనంతరం యాజమాన్యం ఏ నిర్ణయం తీసుకుంటుందో.. అని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.



సైలానీబాబా ఉర్సుకు వేళాయె..


ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ రంజిత్‌కుమార్


సైలానీబాబా దర్గా

- రేపటి నుంచి జాతర ప్రారంభం
- వివరాలు వెల్లడించిన దర్గా పీఠాధిపతి అబ్దుల్ హమీద్

దామెర: హనుమకొండ జిల్లా దామెర మండలం ఓగ్లాపూర్ సమీపంలోని సైలానీ బాబా దర్గాలో 117వ హజ్రత్ సైలానీ బాబా గంధం (ఉర్సు) ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు దర్గా పీఠాధిపతి మహమ్మద్ అబ్దుల్ హమీద్ గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు ప్రకటించారు. జూన్1న (శనివారం) రాత్రి గంధం జాతర ప్రారంభం అవుతుందన్నారు. ఇందులో భాగంగా మహారాష్ట్ర నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన బ్యాండ్ కళాకారుల నృత్యాలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పకీర్ల విన్యాసాలు కనువిందు చేస్తాయన్నారు. తెల్లవార్లు జరిగే ఈ ఉత్సవంలో ప్రత్యేకంగా అలంకరించిన ఒంటెలపై తీసుకొచ్చిన గంధం దర్గాలో సమర్పిస్తామన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతులు ప్రార్థనలు చేస్తారన్నారు. ఉత్సవాల్లో భాగంగా రెండో 2న (ఆదివారం) రాత్రి ఖవ్వాలీ బృంద కళాకారులతో ప్రదర్శనలు, 3వ రోజు జూన్3న (సోమవారం) తహెల్ ఫాతేహా కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తామని వెల్లడించారు.

దేశం నలుమూలల నుంచి భక్తుల రాక..

మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఉమ్మడి రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్తాన్ నుంచి కూడా భక్తులు హాజరవుతారని నిర్వహకులు తెలిపారు. సుమారు రెండు లక్షల మంది హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కాగా, దర్గా ప్రాంగణాన్ని పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు, ఎస్సై కొంక అశోక్ పరిశీలించారు. వీరివెంట రషీద్ బాబా, అమీర్ బాబా, ఎస్‌కే మోయిన్ సైలానీబాబా ఖాదీమ్ తదితరులు ఉన్నారు.

పోలీసులకు చిక్కిన ఘరానా మోసగాడు

- బ్యాంకు బంగారం కాజేసిన గోల్డ్ అప్రైజర్ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ గీతె బాబాసాహెబ్


ప్రశాంత్ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఏటూరునాగారం: బ్యాంకులో కుదవపెట్టిన బంగారం కాజేసిన గోల్డ్ అప్రైజర్ సమ్మెట ప్రశాంత్‌ను అరెస్ట్ చేసినట్లు ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ గీతె బాబాసాహెబ్ తెలిపారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేటలోని కెనరా బ్యాంక్‌లో ప్రశాంత్ గోల్డ్ అప్రైజర్‌గా పనిచేస్తూనే సొంతంగా బ్యాంకు పక్కనే సాయిరామ్ జువెల్లర్స్ షాపు నిర్వహిస్తున్నాడు. మూడు నెలల నుంచి వినియోగదారులు బాంకులో లోన్ కోసం కుదువపెట్టిన బంగారం కాజేసి సొంత అవసరాలకు వాడుకున్నాడు. తన షాపునకు వచ్చే కస్టమర్లు నగల కోసం అడ్వాన్స్‌గా ఇచ్చే డబ్బును స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడికి ఉపయోగిస్తూ మొదట రూ. ఐదు లక్షలు నష్టపోయాడు. తరువాత మరో రూ. ఐదు లక్షలు..ఇలా సుమారు రూ. 70లక్షల వరకు నష్టపోయాడు. ఈ క్రమంలో వినియోగదారులు తాము ఇచ్చిన డబ్బుకు బంగారం ఇవ్వాలని, లేదా డబ్బు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో ఎలాగైనా కస్టమర్లకు డబ్బు ఇవ్వాలనే ఉద్దేశంతో తాను అప్రైజర్‌గా పనిచేస్తున్న కెనరా బ్యాంకును టార్గెట్ చేసుకున్నాడు. ఇందులో భాగంగా వినియోగదారులు బ్యాంకులో కుదవపెట్టి డబ్బు తీసుకునేందుకు ఇచ్చిన బంగారాన్ని క్రమక్రమంగా కాజేయడం మొదలు పెట్టాడు. లోన్ కోసం వస్తున్న వారి బంగారం పరిక్షిస్తున్నట్లు నమ్మించి ఎవరూ చూడని సమయంలో ఆ బంగారం కాజేసి దాని స్థానంలో నకిలీ గోల్డ్ ప్యాకెట్ ఉంచేవాడు. ఇలా మూడు నెలల నుంచి బ్యాంకులో 24 మంది కస్టమర్లకు చెందిన బంగారాన్ని ఇదే తరహాలో కాజేశాడు. ఈ ఘటనపై బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఏటూరునాగారంలోని ఎక్కెల క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ప్రశాంత్ పట్టుబడ్డాడు. దీంతో అతడి నుంచి రూ.2,82,000 లక్షల విలువైన 47 గ్రాములు బంగారం, రూ. 2లక్షల 19వేల విలువైన 2.190 కిలోల వెండి, రూ. 2.51లక్షల నగదు, ఓ కారు, 8 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసును చేదించి ఏటూరునాగారం సీఐ రాజు, మంగపేట ఎస్సై రవి, ములుగు సీసీ సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

కుళ్లిన మాంసం ముద్దలు..

బూజుపట్టిన చేప ముక్కలు

- హానికర రంగులతో తినుబండారాలు
- ఆహార పదార్థాల్లో పురుగులు.. కాలం చెల్లిన సరుకులు..
- హనుమకొండలోని మూడు హోటళ్లలో అధికారుల తనిఖీలు
- కళ్లు బైర్లు కమ్మే నిజాలు వెలుగులోకి..


హనుమకొండలోని ఓ హోటల్‌లో ఆహార పదార్థాలు తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

వరంగల్ అర్బన్/ హన్మకొండ: నిషేధిత ప్లాస్టిక్ కవర్లలో కుళ్లిన మాంసం ముద్దలు.. బూజుపట్టి పట్టిన చేప ముక్కలు.. బొద్దింకలతో కూడిన ఇడ్లీ పిండి, బెల్లం.. హానికర రంగులతో పన్నీరు.. తుప్పు పట్టిన వంట పాత్రలు.. అపరిశుభ్రత వాతావరణం.. కాలం చెల్లిన సరుకులు.. ఇలా గురువారం హనుమకొండలోని మూడు పేరుగాంచిన హోటళ్లలో అధికారులు తనిఖీలు చేపట్టగా కళ్లు బైర్లు కమ్మే నిజాలు వెలుగు చూశాయి. రాష్ట్ర వ్యాప్త తనిఖీల్లో భాగంగా హనుమకొండలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జోనల్ ఫుడ్ కంట్రోలర్ టి. జ్యోతిర్మయి ఆధ్వర్యంలో అధికారులు పలు హోటళ్లలో సోదాలు నిర్వహించారు. హనుమకొండలోని అరణ్య, జంగల్ థీమ్ రెస్టారెంట్‌లో ప్రమాదకర ప్లాస్టిక్ కవర్లలో భారీగా మాంసపు ఉత్పత్తుల నిల్వ బయటపడ్డాయి. హానికర రంగులు కలిపిన పన్నీరు, తుప్పు పట్టిన వంట పాత్రలు, ఫంగస్‌తో కూడిన బూజు పట్టిన కూరగాయలు గుర్తించారు. దీంతో హోటల్ యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే 26 కేజీల మాంసం ఉత్పత్తులు స్వాధీనం చేసుకుని నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. అలాగే, హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రేయ హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో కృత్రిమ హానికర రంగులు కలిపి చేసిన చికెన్ కబాబ్స్, మాంసపు ఉత్పత్తులు, తదితర ఆహార పదార్థాలను అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేసి వినియోగదారులను అనారోగ్యాల పాలు చేస్తున్నట్లు గుర్తించారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న సదరు హోటల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. సుమారు 11 కేజీల రంగు కలిపిన, బూజు పట్టిన చికెన్, ఫ్రిపేర్ ఫిష్ టిక్కా, బొద్దింకలతో కూడిన ఇడ్లీ పిండి, బెల్లం ధ్వంసం చేసి నోటీసులు అందచేశారు.

హోటల్ అశోకాకు ఇంప్రూవ్మెంట్, ఎఫ్ఎస్ఎస్ఏఐ నోటీసులు..

హనుమకొండ చౌరస్తాలోని అశోకా హోటల్ (కాకతీయ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్)ను తనిఖీ చేయగా హానికర కృత్రిమ రంగులు కలిపిన ఆహార పదార్థాలు లభించాయి. అలాగే, భారీగా రంగు డబ్బాలు, రీ-యూజుడ్ 10 లీటర్ల మంచి నూనె, కాలం చెల్లిన కసూరి మేతి, ఎవరెస్టు చికెన్ మసాలా, కాల పరిమితి ముగిసిన సాస్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే, బ్యాచ్ నంబర్, మ్యానుఫ్యాక్చరింగ్ డేట్ లేకుండా స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన రూ. 5,500 విలువైన 17 నూడుల్స్ ప్యాకెట్లు, 28 సోంపు ప్యాకెట్లు సీజ్ చేశారు. శాంపిల్స్ తీసి ప్రయోగశాలకు తరలించారు. హోటల్ యాజమాన్యానికి ఇంప్రూవ్మెంట్ నోటీస్, ఎఫ్ఎస్ఎస్ఏఐ నోటీసు జారీ చేశారు. అనంతరం బల్దియాకు చెందిన వాహనం ద్వారా కుళ్లిన మాంసం వ్యర్థాలను తరలించి పూడ్చిపెట్టారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో హనుమకొండ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పి వేణుగోపాల్ , వరంగల్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సీహెచ్. కృష్ణమూర్తి, మహబూబ్‌నగర్ జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పి. మనోజ్ కుమార్, నల్లగొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పి. స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ..

- పార్క్ చేసిన స్కూటీ డిక్కీ నుంచి రూ.2 లక్షల నగదు అపహరణ
- మహబూబాబాద్‌లో ఘటన


బాధితురాలు నూనావత్ గల్కీ

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్‌లో పట్టపగలే చోరీ జరిగింది. పార్క్ చేసిన స్కూటీ డిక్కీ నుంచి రూ.2 లక్షల నగదు అపహరణకు గురైంది. బాధితురాలి కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండాకు చెందిన నూనావత్ గల్కీ.. శ్రీహనుమాన్ స్వయం సహాయక సంఘం గ్రూపు లీడర్‌గా వ్యవహరిస్తోంది. గల్కీ గ్రూపునకు రూ.20 లక్షల రుణం మంజూరుకాగా ఆ డబ్బు డ్రా చేసుకునేందుకు పలువురు సంఘం సభ్యులతో కలిసి గురువారం జిల్లా కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (నెహ్రూ చౌక్) బ్రాంచ్ వద్దకు వచ్చింది. రూ.5 లక్షలు డ్రా చేసి అందులో నుంచి రూ.2 లక్షలు ఓ సభ్యురాలు నూనావత్ విజయకు, రూ.లక్ష గల్కీ కోడలు నూనావత్ మీనాకు ఇచ్చింది. మిగతా రూ.2 లక్షలు తన తమ్ముడు భూక్య రాములు కుమారుడు రంజిత్‌కు ఇవ్వగా అతడు బ్యాంకు సమీపంలో పార్క్ చేసిన తన స్కూటీ డిక్కీలో భద్రపరిచాడు. అనంతరం గ్రూపు సభ్యురాలు విజయకు ఉపాధి హామీ పథకంలో పనిచేసిన డబ్బులు తన ఖాతాలో జమ అయ్యాయో లేదో తెలుసుకునేందుకు పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఇందిరా చౌక్) బ్రాంచ్ వద్దకు వెళ్లారు. బ్యాంకు ఎదుట ద్విచక్ర వాహనం పార్క్ చేసి లోపలికి వెళ్లి సమాచారం తెలుసుకుని వచ్చారు. అనంతరం ద్విచక్రవాహనంపై తమ గ్రామానికి బయలుదేరారు. గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద స్కూటీలో పెట్రోల్ పోయించుకునేందుకుగాను డిక్కీ తెరువగా అందులోని రూ.2 లక్షలు కనిపించకపోవడంతో చోరీ జరిగిందని గుర్తించారు. వెంటనే వచ్చి బ్యాంకులో అధికారులకు జరిగిన విషయం చెప్పి బాధితురాలు గల్కీ కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ దేవేందర్ ఘటనా స్థలికి చేరుకుని సీసీ ఫుటేజీ పరిశీలించి విచారణ చేపట్టారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

- మహిళ మృతి.. యువకుడికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన రవికిరణ్

ఖానాపురం : కారు.. ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళ మృతి చెందగా యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం ఖానాపురం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల ప్రకారం.. ములుగు జిల్లా రాయినిగూడేనికి చెందిన గొంది నర్సమ్మ(51) మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం సాధిరెడ్డిపల్లిలో శుభకార్యానికి హాజరైంది. నర్సంపేటలో పనుల నిమిత్తం అదే గ్రామానికి చెందిన తన బంధువు పులుసం రవికిరణ్ ద్విచక్ర వాహనంపై వచ్చింది. పనులు ముగించుకుని సాధిరెడ్డిపల్లికి తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు కారులో భద్రాచలం వెళ్లి హనుమకొండకు వస్తున్నారు. మండలంలోని చిలుకమ్మనగర్ చెక్‌పోస్టు సమీపంలో కారు.. ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సమ్మ, రవికిరణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో గమనించిన ఇతర వాహనదారులు నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతర మెరుగైన వైద్యం కోసం ఇద్దరిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ నర్సమ్మ మృతి చెందింది. రవికిరణ్ చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలిని ఎస్సై రఘుపతి సందర్శించి వివరాలు సేకరించారు. మృతురాలికి కుమార్తె ఉంది. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

భూమి దక్కదనే మనస్తాపంతో రైతు ఆత్మహత్య


సారయ్య(ఫైల్)

సంగెం: భూమి విషయంలో తిట్టి అవమానించారని, భూమి దక్కదని మనస్తాపం చెందిన ఓ వృద్ధ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నించి చికిత్స మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా సంగెం మండలం ముమ్మడివరం గ్రామానికి చెందిన దామెర్పుల సారయ్య(70కు ఇద్దరు కుమారులు రాజేశ్వర్, విజయ్‌కుమార్ ఉన్నారు. తనకున్న వ్యవసాయ భూమిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచి ఇచ్చాడు. ఇటీవల చిన్న కుమారుడు విజయ్‌కుమార్ తన భూమిని హనుమకొండకు చెందిన లాయర్ నిమ్మాని శేఖర్‌రావు, విజయలక్ష్మి దంపతులకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకుని బయానాగా రూ.1.50లక్షలు తీసుకుని, పట్టాదార్ పాస్‌బుక్ ఇచ్చారు. ఈ విషయం విజయ్‌కుమార్ భార్య రవళికి తెలిసి భూమి విక్రయించొద్దని గొడవ చేసింది. దీంతో విజయ్‌కుమార్ తన భార్య రవళి, తండ్రి సారయ్య(మృతుడు), పెద్ద మనుషులతో కలిసి లాయర్ శేఖర్‌రావు ఇంటికి వెళ్లి అడ్వాన్స్ తీసుకున్న డబ్బులు తిరిగి ఇస్తాం.. మా పట్టాదార్ పాస్‌బుక్ ఇవ్వాలని కోరారు. దీంతో లాయర్ దంపతులు అసభ్యపదజాలంతో దూషించి వెళ్లగొట్టారు. ఈ క్రమంలో వారం క్రితం విజయ్‌కుమార్, రవళి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబీకులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తన కుటుంబంలో గొడవలకు కారణం లాయర్ శేఖర్ రావు, విజయలక్ష్మి దంపతులేనని.. భూమి దక్కదని మనస్తాపానికి గురైన సారయ్య బుధవారం రాత్రి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు వరంగల్ ఎంజీఎం తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై సారయ్య పెద్ద కుమారుడు రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ వెల్లడించారు.

వరంగల్ పాతక్ మహాల్‌లో వివాహిత..

రామన్నపేట : మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన వరంగల్ పటాక్ మహాల్‌లో జరిగింది. మట్టెవాడ సీఐ గోపి కథనం ప్రకారం.. నాక్ సేవిక్ సమితి అనుబంధంగా ఉన్న వైదేహి ఆశ్రమంలో ఉంటున్న భవ్య(23)కు వరంగల్ పాతక్‌మహాల్‌కు చెందిన గంప రాజేశ్‌తో వివాహం జరిగింది. ఈ దంపతులకు మొదటి సంతానంగా కుమారుడు జన్మించి ప్రస్తుతం 18 నెలలు ఉన్నాడు. రెండో కాన్పులో మూడు నెలల తరువాత అబార్షన్ కావడంతో మనస్తాపానికి గురైన భవ్య.. 29వ తేదీన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై సేవి సమితి కార్యనిర్వహక కార్యదర్శి కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపి తెలిపారు.

సైబర్ మోసం..

- రూ.1.04 లక్షలు మాయం
- యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో లింక్..
- క్లిక్ చేయగానే నగదు స్వాహా
- గడ్డిగూడెంలో ఘటన


వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు వెంకన్న

మహబూబాబాద్ రూరల్ : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో సమాచారం కోసం వచ్చిన ఓ లింకుపై క్లిక్ చేయండి అని కనిపించిన సందేశం అతడి కొంపముంచింది. నిజంగానే తన బ్యాంకు నుంచే ఆ లింక్ వచ్చిందనుకుని పొంచి ఉన్న మోసాన్ని గుర్తించలేక తన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.1.04 లక్షల నగదును ఓ యువకుడు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన గురువారం మహబూబాబాద్ మండలం గడ్డిగూడెంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన ధరావత్ వెంకన్నకు మహబూబాబాద్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా ఉంది. తన సెల్ ఫోన్‌కు ఈ నెల 29వ తేదీన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో బ్యాంకు లోగో కలిగిన గుర్తు నుంచి ఒక లింక్ వచ్చింది. సమాచారం కోసం లింక్‌ను క్లిక్ చేయండి అని కనిపించడంతో వెంటనే దానిపై క్లిక్ చేశాడు. 30వ తేదీన సెల్ ఫోన్ చూసుకుంటే తన బ్యాంకు ఖాతానుంచి రూ.24,500, రూ.25,500, రూ.54 వేలు చొప్పున విడుతల వారీగా రూ.1.04 లక్షలు ఉపసంహరణ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీనిపై సంబంధిత బ్యాంకుకు వెళ్లి ఆరాతీయగా అతడి ఖాతాలో నగదు ఉపసంహరణ అయినట్లు అధికారులు తెలిపి, వెంటనే ఆ ఖాతా లావాదేవీలను నిలుపుదల చేశారు. బ్యాంక్ అధికారుల సూచన మేరకు వెంకన్న సైబర్ క్రైమ్ విభాగం నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. భవిష్యత్ అవసరాల కోసం పొదుపు చేసిన సొమ్ము ఇలా దోపిడీకి గురవడంతో బాధితుడు కన్నీరుమున్నీరవుతున్నాడు. అపరిచిత వ్యక్తుల ద్వారా వచ్చే ఫోన్ కాల్స్‌కు బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఇతర సమాచారం ఇవొద్దని పోలీసులు ఎంత చెప్పినా ప్రజలు మాత్రం పట్టించుకోవడం లేదు. సులువుగా డబ్బులు వస్తాయనే ఆశతో సైబర్ మోసగాళ్లకు బ్యాంకు సమాచారం ఇచ్చి ఖాతాను గుల్లచేసుకుంటున్నారు.

ఆవేశంలో అనంతలోకాలకు..

పరికత్వత లేని వయసు.. మంచి, చెడులు పట్టించుకోని స్వభావం.. పైగా క్షణికావేశం.. ఇంకేముంది అనాలోచిత నిర్ణయంతో తనువులు చాలిస్తున్నారు. తల్లిదండ్రులు మందలించారనే కారణంతో పిల్లలు మనస్తాపం చెంది అర్ధాంతరంగా జీవితాలు ముగిస్తున్నారు. కారణాలు విశ్లేషించుకోకుండా బలవన్మరణాలకు పాల్పడుతూ తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారు.

తండ్రి మందలించాడని.. తనయుడి బలవన్మరణం


అఫీజ్(ఫైల్)

గీసుకొండ : తండ్రి మందలించాడనే కారణంతో మనస్థాపం చెందిన ఓ యువకుడు బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. షేక్ అఫీజ్ (18) అనే యువకుడు వరంగల్ ఆటోనగర్‌లో వెల్డింగ్ రిపేరింగ్ పనులు చేస్తున్నాడు. ఈ నెల 27న పని సరిగా చేయడం లేదని తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన అఫీజ్.. పనికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో గురువారం గొర్రెకుంటలోని కందుల రమేశ్ వ్యవసాయ బావిలో అఫీజ్ మృతదేహం తేలింది. దీనిని పరిశీలించిన తండ్రి షేక్ ఇమామ్.. ఆ మృతదేహం తన కుమారుడిదని గుర్తించారు. అనంతరం షేక్ ఇమామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ సీఐ ఎల్. పవన్‌కుమార్ తెలిపారు.

మైసంపల్లిలో బాలుడు..

దుగ్గొండి: ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ఇంట్లోనే ఉండాలని తల్లి మందలించిందనే కారణంతో ఓ బాలుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన మోకిడె శాంత భర్త రాజు కొంత కాలం క్రమృతి చెందడంతో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు శివప్రసాద్‌ను టెన్త్ క్లాస్ కోచింగ్‌కు పంపింది. చిన్న కుమారుడు కాంతారావు(సిద్దు)(9) మూడో తరగతి పూర్తి చేశాడు. ఈ క్రమంలో వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయని ఇష్టం వచ్చినట్లు తిరుగుతున్నావని, ఇంట్లోనే ఉండాలని మందలించింది. దీనిపై మనస్తాపం చెందిన సిద్దు.. తల్లి కూలీ పనులకు వెళ్లిన అనంతరం ఉరేసుకున్నాడు. ఇది గమనించిన ఇరుగుపొరుగు వారు కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి మేనమామ దోలె యువరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు.